

నయా ట్రెండ్ గురూ
బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో మహిళలంతా ఒకే రకమైన చీరలు ధరించి సదరు వేడుకల్లో ఆడి పాడుతున్నారు.
వివరాలు 10లో ▸



మెరిసిన మెతుకు సీమ
టీజీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్ -1 ఫలితాల్లో మెతుకు సీమకు చెందిన అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారు.
వివరాలు 10లో ▸



కాత్యాయినీదేవిగా అమ్మవారు
దేవీశరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు నాల్గవరోజు కాత్యాయినీ దేవిగా దర్శనమిచ్చారు.
వివరాలు 11లో ▸

నేడు డీఎస్పీ సత్తయ్యగౌడ్‌తో 'సాక్షి' ఫోన్‌ఇన్





అంశం : పండుగ వేళ ప్రయాణాలు, ఇళ్లలో చోరీలు, జాగ్రత్తలు తదితర అంశాలు
తేదీ : 26-09-2025
సమయం : ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్లు :
87126 56718, 95058 72923, 99083 47613

న్యూస్‌రీల్

ఆటో డ్రైవర్ కొడుకుకు ఎంబీబీఎస్ సీటు



తండ్రి ఇబ్రహీంతో ఒబేద్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండలం హోతి(బి)గ్రామానికి చెందిన ఓ ఆటో డ్రైవర్ కొడుకు ఎంబీబీఎస్ సీటు సాధించాడు. గ్రామానికి చెందిన ఇబ్రహీం ఆటో నడుపుతూ కుటుంబ పోషణ చేస్తున్నాడు. కొడుకు ఎండీ. ఒబేద్‌ను బాగా చదివించాలనుకుని అల్గోల్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో చేర్పించాడు. ఒబేద్ 5 నుంచి ఇంటర్ వరకు అక్కడే చదువుకున్నాడు. మంచి ఫ్యాకల్టీ ఉండటంతో కష్టపడ్డాడు. నీట్ కౌన్సెలింగ్ మొదటి దశలోనే నాగర్ కర్నూల్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందాడు.


అంగవైకల్యం విజయాలను ఆపలేదు



సమావేశంలో మాట్లాడుతున్న సౌజన్య

సంగారెడ్డి : అంగవైకల్యం అనేది విజయాలను ఆపలేదని జిల్లా న్యాయసేవాధిక సంస్థ కార్యదర్శి బి.సౌజన్య పేర్కొన్నారు. ప్రపంచ బధిరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా ప్రభుత్వాస్పత్రిలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ... చాలామంది బధిరుల సమస్యలను పూర్తి అర్థం చేసుకోలేపోతున్నారన్నారు. బధిరుల హక్కులు, అవసరాలు, ప్రతిభ, సమస్యలపై సమాజానికి అవగాహన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తి డిప్యూటీ ఎ.శశాంక్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ మురళీకృష్ణ, డాక్టర్ భవ్య తల్లిదండ్రులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి జాతీయస్థాయి అవార్డు



శ్రీదేవికి అవార్డును అందజేస్తున్న నటుడు రఘు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల పట్టణ పరిధిలోని అన్నారం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు వాకిటి శ్రీదేవి ఇటీవలే రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును అందుకున్న విషయం తెలిసిందే. గురువారం నగరంలోని బిర్లా ప్లానిటోరియంలో జరిగిన మూడు రాష్ట్రాల ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శారద ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యారంగంలో విశిష్ట సేవలందిస్తున్న ఉపాధ్యాయుల సేవలను ప్రశంసిస్తూ జాతీయస్థాయిలో వాకిటి శ్రీదేవికి ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపికను జబర్దస్త్ కమెడియన్ రఘు చేతుల మీదుగా అందజేశారు. జాతీయస్థాయిలో ఎంపిక చేసి అవార్డును అందించిన ట్రస్ట్ సభ్యులకు వాకిటి శ్రీదేవి ధన్యవాదాలు తెలుపుతూ అవార్డు అందుకోవడం పై సంతోషం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలు

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వర మందిరంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గురువారం కాత్యాయిని అవతారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు

కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

సంస్కృతి సంప్రదాయాలకు నిలయమైన బతుకమ్మ సంబురాలు కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కలెక్టర్ ప్రావీణ్య హాజరై గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేసి, అధికారులతో కలసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్తు డిప్యూటీ సీఈఓ స్వప్న, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు. -సంగారెడ్డి జోన్



మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

తిరస్కరిస్తే స్పష్టంగా కారణాలు చెప్పాలి

భూ భారతి దరఖాస్తులపై కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి జోన్: భూ భారతిలో సమస్యల పరిష్కారానికి వచ్చిన దరఖాస్తులు తిరస్కరిస్తే అందుకు సహేతుకమైన కారణాలు స్పష్టంగా పేర్కొనాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. భూ భారతిపై రెవెన్యూ శాఖ అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు పూర్తి వివరాలు జత చేసి తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీఓకు, అక్కడి నుంచి కలెక్టరేట్‌కు పంపించాలన్నారు. సాదా బైనామా, పీఓటీలకు సంబంధించిన దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో సంబంధిత స్థలాలను పరిశీలించి విచారణ జరపాలని ఆదేశించారు. త్వరితగతిన నోటీసులు జారీ చేస్తూ జీపీఎస్ ఆధారిత సర్వే డిజిటలైజేషన్ వివరాలను నమోదు చేయాలన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి సమస్య 15 రోజుల్లోగా పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ మాధురి, ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీఓలు దేవుజా పాల్గొన్నారు.

మద్యం టెండర్లకు వేళాయె

ఖరారైన దుకాణాల రిజర్వేషన్లు

- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఈసారి కేటాయింపుల్లో స్వల్ప మార్పులు చేర్పులు
- రెండు మద్యం షాపులను ఒక చోటు నుంచి మరో చోటికి తరలింపు
- అందోల్, జహీరాబాద్‌ల నుంచి సదాశివపేట, పటాన్‌చెరులకు..
- వచ్చే నెల 23న డ్రా ప్రక్రియ



కలెక్టర్ సమక్షంలో రిజర్వేషన్ల డ్రా ప్రక్రియ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : మద్యం దుకాణాల కేటాయింపుల్లో ఈసారి స్వల్ప మార్పులు, చేర్పులు జరిగాయి. గత రెండేళ్ల మద్యం అమ్మకాలను దృష్టిలో ఉంచుకుని కొన్ని దుకాణాలను మార్చారు. వయెబిలిటీ పేరుతో మద్యం అమ్మకాలు తక్కువగా ఉన్న అందోల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఓ దుకాణాన్ని సదాశివపేటకు మార్చారు. అలాగే జహీరాబాద్ స్టేషన్ పరిధిలో ఉన్న మరో దుకాణాన్ని పటాన్‌చెరు స్టేషన్ పరిధిలోకి తీసుకువచ్చారు. వీలైనంత ఎక్కువ అమ్మకాలు జరిగేలా ఈ మార్పులు చేశారని ఎక్సైజ్‌శాఖ వర్గాలు తెలిపాయి. ఈసారి మద్యం దుకాణాల సంఖ్యలో ఎలాంటి మార్పులు లేవు. గతంలో ఉన్న మాదిరిగానే 101 దుకాణాలకే పరిమితం చేశారు. ఇదే మార్పులు చేర్పుల ప్రక్రియలో భాగంగా ఇతర జిల్లాల నుంచి సంగారెడ్డి జిల్లాకు మరికొన్ని మద్యం దుకాణాలు వస్తాయని భావించారు. దీంతో ఈ సంఖ్య పెరుగుతుందని అనుకున్నారు. కానీ అలాంటి మార్పులేవీ జరగలేదు.

మద్యం దుకాణాల కేటాయింపులకు సంబంధించి గురువారం రిజర్వేషన్లు ఖరారయ్యాయి. మొత్తం 101 దుకాణాల్లో ఎస్సీలకు 13 దుకాణాలు, ఎస్టీలకు 2 దుకాణాలు కేటాయించారు. గౌడ సామాజికవర్గానికి 9 దుకాణాలను రిజర్వు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా సామాజికవర్గాల జనాభా ఆధారంగా ఈ రిజర్వేషన్లు కేటాయించినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మొత్తం 24 దుకాణాలు రిజర్వేషన్లు మినహాయిస్తే 77 దుకాణాలు ఓపెన్ కేటగిరీలో ఉన్నాయి. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఈ రిజర్వేషన్ల డ్రా ప్రక్రియను నిర్వహించారు.

గతంలో 6,156 దరఖాస్తులు

రెండేళ్ల క్రితం నిర్వహించిన టెండరు ప్రక్రియలో 6,156 దరఖాస్తులు వచ్చాయి. తద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.123.12 కోట్ల ఆధాయం లభించింది. ఈసారి అంతకంటే ఎక్కువ దరఖాస్తులే వస్తాయని ఎక్సైజ్‌శాఖ భావిస్తోంది. గతంలో కంటే సుమారు 40% అధికంగా దరఖాస్తుల ఆదాయం లభించవచ్చని అంచనా వేస్తున్నారు. కాగా, ప్రస్తుతం రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి సుముఖంగా లేరు. మద్యం దుకాణాల ద్వారా మంచి ఆదాయం ఉండటంతో ఇందులో పెట్టుబడులు పెట్టేందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో ఈసారి ఈ దుకాణాలకు పోటీ ఎక్కువగా ఉంటుందని అనుకుంటున్నారు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలు కూడా ఉండటంతో మద్యం విక్రయాలు ఎక్కువే ఉంటాయని భావిస్తున్నారు.

వచ్చే నెల 18 వరకు స్వీకరణ

2025 డిసెంబర్ నుంచి 2027 నవంబర్ వరకు..రెండేళ్ల కాలపరిమితితో మద్యం దుకాణాల కేటాయింపులకు సంబంధించి ప్రభుత్వం గురువారం షెడ్యూల్ విడుదల చేసింది. ఇందులోభాగంగా శుక్రవారం ఈ దుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన వెంటనే దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబర్ 18 వరకు గడువు విధించింది. అదే నెల 23న డ్రా నిర్వహించి దుకాణాలను కేటాయిస్తారు. వెంటనే మొదటి వాయిదా డబ్బులను చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈసారి దరఖాస్తు ఫీజును రూ.రెండు లక్షల నుంచి రూ.మూడు లక్షలకు పెంచారు.

బతుకమ్మ ఘాట్‌ను సందర్శించిన ఎంపీ

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం పట్టణ పరిధిలోని మంత్రికుంటలో నూతనంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ ఘాట్‌ను ఎంపీ రఘునందన్‌రావు గురువారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... దసరా బతుకమ్మ పండుగల నేపథ్యంలో మహిళల కోసం ప్రత్యేకంగా నిర్మించిన బతుకమ్మ ఘాటును అన్ని హంగులతో తీర్చిదిద్దామన్నారు. అనంతరం జిన్నారం పట్టణ కేంద్రంలో స్థానికులతో కలిసి స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు వెంకటరామయ్య, తిరుపతి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి, బీజేపీ మండల అధ్యక్షుడు జగన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎంపీ రఘునందన్‌రావు

జ్యూట్ బ్యాగులనే వినియోగించాలి

ఇన్‌చార్జి డీఆర్‌డీఓ బాల్‌రాజ్

వటప్పల్లి(అందోల్): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ జ్యూట్ బ్యాగులనే వినియోగించాలని ఇన్‌చార్జి డీఆర్‌డీఓ బాల్‌రాజ్ పేర్కొన్నారు. అందోల్ మండల పరిధిలోని సంగుపేట గ్రామంలో ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణపూర్తి చేసుకున్న మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ పత్రాలను గురువారం బాల్‌రాజ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్లాస్టిక్ కవర్లు పర్యావరణానికి హాని కలిగిస్తాయన్నారు.

అంకితభావంతో వైద్య సేవలందించాలి

డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మహ్మద్ షరీఫ్

జోగిపేట(అందోల్): వైద్య మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ఆస్పత్రికి చెడ్డపేరు రాకుండా డాక్టర్లు, సిబ్బంది సక్రమంగా విధులను నిర్వహించాలని ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎండీ షరీఫుద్దీన్ స్పష్టం చేశారు. జోగిపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ...వైద్యులు, సిబ్బంది సమయ పాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. శానిటేషన్ విషయంలో నిర్లక్ష్యం కూడదన్నారు. గర్భిణీల పట్ల దురుసుగా ప్రవర్తించకూడదని, ఇక ముందు అలా జరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. 150 ఎంసీహెచ్ ఆస్పత్రి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయించేందుకు మంత్రి దామోదర రాజనర్సింహ కృషి చేస్తున్నారన్నారు. ఆస్పత్రికి సంబంధిన కొన్ని విభాగాలకు చెందిన పరికరాల అవసరతపై ఉన్నతాధికారులకు నివేదికను అందజేసినట్లు తెలిపారు.



సోయాబిన్ పంటలో అంతర పంటగా వేసిన కంది

తగ్గుతున్న పప్పు ధాన్యాల సాగు

జిల్లాలో గత కొన్నేళ్లుగా పప్పు ధాన్యాల సాగు విస్తీర్ణం వివరాలు (ఎకరాల్లో)

పంట రకం	2021-22	2022-23	2023-24	2024-25
కంది	90,303.2	80,314.06	79,133.2	77,110.37
మినుములు	16,388.2	5,951.23	6,175	88,97.05
పెసర	21,986.04	13,053.32	9,621.03	13,478.21
ఉలవలు	7.29	1.22	3.38	7.38
బొబ్బర్లు	1.2	1.26	1	6.19
అనుములు	4.05	4.27	0.13	8.34
శనగలు	42,132.16	23,962.13	17,516.33	18,143.01

- లక్ష ఎకరాల్లోపే సాగు విస్తీర్ణం
- వాణిజ్య పంటల సాగుకే ఆసక్తి
- అధిక వర్షాలతో తగ్గుతున్న దిగుబడి
- జహీరాబాద్‌లోనే ఎక్కువగా సాగు

సంగారెడ్డి జోన్: జిల్లాలో గత కొన్నేళ్లుగా పప్పుదినుసుల సాగు విస్తీర్ణం తగ్గుతోంది. కొన్నేళ్ల క్రితం 1.60 లక్షల ఎకరాల విస్తీర్ణంలో చిరుధాన్యాలు సాగు చేస్తుండగా ప్రస్తుతం 99 వేల ఎకరాల్లోనే సాగు అవుతోంది. వ్యవసాయ శాఖ అధికారుల గణాంకాల ప్రకారం సగానికి పైగా సాగు తగ్గిపోయింది. మరికొన్ని ధాన్యాలు సాగు చేయటమే పూర్తిగా మరిచిపోయారు. జిల్లాలో ఎక్కువగా జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, మొగుడంపల్లి, న్యాల్‌కల్, రాయికోడ్, మానూర్ తదితర మండలాల్లో ఎక్కువగా ఈ చిరుధాన్యాలను సాగు చేస్తుంటారు.

తగ్గుతున్న ఉత్పత్తులు

పప్పు దినుసులు సాగు చేసినప్పటికీ అధిక లాభాలు రాకపోవడంతోనే గణనీయంగా ఉత్పత్తులను తగ్గిపోతున్నాయి. జిల్లాలో 7.50 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగు చేస్తుండగా అందులో ఎక్కువగా పత్తి పంట 3.52 లక్షల ఎకరాలు, 1.50 లక్షల ఎకరాల్లో వరి, హార్టికల్చర్ 25 వేల ఎకరాల్లో సాగు చేస్తుండగా మిగతా భూముల్లో ఇతర పంటలు సాగు చేస్తున్నారు. అయితే చిరుధాన్యాలు మాత్రం లక్ష ఎకరాల్లోపు మాత్రమే సాగు చేస్తున్నారు. సాగు చేసిన పంటలకు సరైన మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో కూడా సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది.

పంటలపై వర్షాల ప్రభావం

చిరు ధాన్యాలు సాగుపై వర్షాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పెసర, మినుము, అనుములు పంటలు చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఆయా పంటలకు నష్టం వాటిల్లుతోంది. యాసంగిలో కంది, శనగ, సామలు, కొర్రలు, జొన్న పంటలు సాగు చేస్తుంటారు. శీతాకాలంలో అధిక మంచు కురిసిన సమయంలో కంది, శనగ పూత దశలో ఉండటంతో వాటిపై ప్రభావం చూపి పూత రాలిపోతుంది. వేసవిలో జొన్న పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు కురిసి వాటి కంకులు రంగులు మారి దిగుబడులపై ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుతం సాగు చేస్తున్న చిరు పంటలు సొంత అవసరాలకు కేటాయిస్తున్నారు. మిగిలి ఉన్న పంట ఉత్పత్తులనే మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

మద్దతు ధర ప్రకటించినా...

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేందుకు మద్దతు ధర ప్రకటించినప్పటికీ రైతులు మాత్రం ప్రత్యామ్నాయ పంటలపట్ల ఆసక్తి చూపడం లేదు. ఒకవేళ సాగు చేసినా పంటల దిగుబడితో పాటు నష్టాలు రావడంతో రైతులు పత్తి, వరి, సోయాబీన్, చెరుకు తదితర పంటలను మాత్రమే సాగు చేస్తున్నారు. దీంతో పప్పు దినుసుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అయితే సన్నరకం వరికి మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ కల్పించినట్లే చిరుధాన్యాల సాగు చేసే రైతులకు బోనస్ ప్రకటిస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నాయని రైతులు అభిప్రాయపడుతున్నారు.

సాగు విస్తీర్ణం పెంచేందుకు అవగాహన

చిరుధాన్యాల విస్తీర్ణం పెంచేందుకు ఝరాసంగం మండలంలోని డెక్కన్ డెవలప్ మెంట్ సొసైటీ, అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థల ఆధ్వర్యంలో సేంద్రియ విధానంలో పంటలు సాగు చేస్తూ వాటి ప్రాముఖ్యతపై అధికారులతో కలిసి అవగాహన కల్పిస్తున్నారు.

ఇంటర్‌పై నజర్



- సంస్కరణల దిశగా ఇంటర్ బోర్డు
- ప్రతీ నెల విద్యార్థుల తల్లిదండ్రులు టీచర్లతో సమావేశాలు
- ప్రాక్టికల్స్‌కు ఒకరోజు కేటాయింపు
- ఇంటర్ కళాశాలల నిర్వహణకు నిధులు

నారాయణఖేడ్: రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ విద్యపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ఏడాది కాలంగా ఇంటర్ విద్యావిధానంలో పలు సంస్కరణలు, ఆయా కార్యక్రమాలకు నిధులు విడుదల చేస్తూ వస్తుంది. టెన్త్ ఉత్తీర్ణులైన ప్రతీ విద్యార్థి ఇంటర్ వరకు చదివేలా చూడాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఆదిశగా ఇంటర్ కళాశాలల్లో సదుపాయాల కల్పన చేస్తూ పలు సంస్కరణలకు ఉపక్రమించింది. ఇందులోభాగంగా ఇంటర్‌లో విద్యార్థులకు ఉపాధ్యాయుల తరహాలోనే ఫేషియల్ రికగ్నేషన్ సిస్టమ్ హాజరు (ముఖ ఆధారిత హాజరు) విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఈ విధానం వల్ల విద్యార్థుల హాజరు శాతం పెరుగుతోంది. విద్యార్థుల హాజరు వివరాలు ప్రతినిత్యం వారి తల్లిదండ్రులకు తెలిసేలా ఎస్‌ఎంఎస్ రూపంలో పంపిస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు నిత్యం కళాశాలకు వెళ్తున్నారా లేదా అనేది స్పష్టంగా తెలిసిపోతోంది. సంస్కరణలు, ఇంటర్ విద్యపై ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధ కారణంగా ఉమ్మడి జిల్లాలో ఇంటర్‌లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య గణనీయంగా పెరిగింది. సంగారెడ్డి జిల్లాలో 20 ప్రభుత్వ కళాశాలల్లో 8,000, మెదక్ జిల్లాలో 17 కళాశాలల్లో 3,500, సిద్దిపేట జిల్లాలో 20 కళాశాలల్లో 8,000 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

నేడు పేరెంట్స్- టీచర్స్ సమావేశం

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జూనియర్ కళాశాలల్లో ఈనెల 26న పేరెంట్స్- టీచర్స్ సమావేశాలను విద్యామండలి ఏర్పాటు చేసింది. ఈ సమావేశాల్లో బోధకులతో ప్రత్యక్షంగా మాట్లాడే అవకాశంతో పాటు, పిల్లల హాజ రు, వారి విద్యా ప్రగతి తెలుసుకోనున్నారు.

అంశాల వారీగా నిధుల కేటాయింపు

ప్రతీ కళాశాలలో ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు, తరగతి గదులు, క్యాంపస్‌లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, కళాశాలల మరమ్మతులకు నిధులు, నూతనంగా మరుగు దొడ్ల నిర్మాణం, కొత్త గదులు, భవనాలు, గ్రీన్ బోర్డుల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన, అమ్మాయిల కళాశాలల్లో శానిటరీ న్యాప్కిన్స్ వెండింగ్ మెషీన్లు, సైన్స్‌ల్యాబ్ సామగ్రికి రూ.25వేల చొప్పున నిధులు, కళాశాల శుభ్రత, నిర్వహణకు రూ.10వేల చొప్పున నిధులు , క్రీడాసామగ్రి కోసం రూ.10వేల చొప్పున ప్రతీ కళాశాలకు కేటాయించనున్నారు. అదేవిధంగా ప్రాక్టికల్స్ నిర్వహణకు, కళాశాల సౌకర్యాల నిర్వహణకు విద్యార్థుల సంఖ్య అనుగుణంగా ప్రతీనెల నిర్వహణ గ్రాంటు వివరాలను తెలియపర్చనున్నారు. ప్రతీనెల ఇలా పేరెంట్స్ సమావేశాలు కొనసాగనున్నాయి.

మరిన్ని సౌకర్యాలు..

ఇంటర్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఇంటర్ బోర్డు చర్యలు చేపట్టింది. విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇంటర్‌లో ప్రతీ వారం యోగ, ధ్యానం, క్రీడలు, ల్యాబ్‌లకు మూడు పీరియడ్లను కేటాయించనున్నారు. వారంలో ఒకరోజు ధ్యానం లేదా యోగ, మరో రోజు క్రీడలకు కేటాయించనున్నారు. ప్రైవేట్ కళాశాలల్లో సైన్స్ విద్యార్థులకు ల్యాబ్‌లో తరగతులు నిర్వహించడం లేదన్న ఆరోపణల దృష్ట్యా వారంలో ఒకరోజు ప్రత్యేకంగా ప్రాక్టికల్స్‌కు కేటాయించనున్నారు. దీంతోపాటు వచ్చే విద్యా సంవత్సరం నుంచి నూతన సిలబస్‌ను కూడా అమలు చేయనున్నారు.

అంగన్‌వాడీలకు పండుగ సెలవులు

సంగారెడ్డి జోన్: ప్రభుత్వ పాఠశాలల మాదిరిగా అంగన్ వాడీ కేంద్రాలకు దసరా, బతుకమ్మ పండుగ సెలవులు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 27 నుంచి వచ్చే నెల నాలుగు వరకు సెలవులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బతుకమ్మ, దసరా పండుగలను జరుపుకునేందుకు వీలుగా సెలవులు ఇవ్వాలని టీచర్లు, హెల్పర్లు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కను కలిసి విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తి మేరకు సెలవులను మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. అంగన్ వాడి చరిత్రలో మొట్టమొదటిసారిగా దసరా, బతుకమ్మ పండుగ సెలవులు వచ్చాయి. సెలవులు ప్రకటించడంతో సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, సెలవుల్లో పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ పద్ధతిలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

క్లుప్తంగా

మంత్రిని కలిసిన ఫార్మసీ కౌన్సిల్ సభ్యులు


మంత్రి దామోదరను కలిసిన రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ సభ్యులు రాజు

చేగుంట(తూప్రాన్): ప్రపంచ ఫార్మసిస్ట్ డేను పురస్కరించుకొని చేగుంటకి చెందిన రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడురాజు హైదరాబాద్‌లో మంత్రి దామోదర రాజనర్సింహను మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని మర్యాదపూర్వకంగా సన్మానించి ఫార్మసీ కౌన్సిల్‌తో పాటు ఫార్మసిస్టులకు సంబంధించిన సమస్యలను వివరించినట్లు రాజు తెలిపారు. ఆయన వెంట మెదక్ జిల్లా ఫార్మసీ కౌన్సిల్ నాయకులు ఉన్నారు.

సాదత్‌అలీకి నేషనల్ టీచర్ ఎక్సలెన్స్ అవార్డు


నేషనల్ టీచర్ ఎక్సలెన్స్ అవార్డు అందుకుంటున్న సాదత్ అలీ

దుబ్బాక: స్థానిక మున్సిపాలిటీలోని ధర్మాజీపేట జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం డాక్టర్ మహ్మద్ సాదత్‌అలీ నేషనల్ టీచర్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని శారద ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు ఆయనను నేషనల్ టీచర్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ ఆడిటోరియంలో ఎమ్మెల్సీ కొమరయ్య, తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషనల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ పురుషోత్తం చేతుల మీదుగా సాదత్‌అలీ అవార్డు అందుకున్నారు. కాగా, సాదత్‌అలీ సామాజిక సేవతో పాటు సింపుల్ టాస్క్ గ్రేట్ కాన్సెప్ట్ ప్రయోగాలతో విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంచే విధంగా కృషి చేశారు. అలాగే జాతీయ స్థాయిలో ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలలో పరిశోధన పేపర్లలో ప్రచురితం కావడంతో ఆయనకు ఈ అవార్డు వరించింది.

సైబర్ నేరాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న జిల్లా షీ టీం ప్రతినిధులు

నర్సాపూర్: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని జిల్లా షీ టీం సభ్యురాలు గంగామణి చెప్పారు. గురువారం స్థానిక శివాలయంలో బతుకమ్మ ఆడేందుకు వచ్చిన మహిళలకు, పిల్లలకు ఆమె పలు అంశాలపై అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులు ఓపెన్ చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి వీరప్పగురు స్వామి, వాసు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం


సవిత

జహీరాబాద్ టౌన్: మండలంలోని అనేగుంటకి చెందిన ప్యాలారం సవిత(22) అదృశ్యమైనట్లు రూరల్ ఎస్ఐ కాశీనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. అనేగుంటకు చెందిన అంజయ్య కూతురు సవిత ఈనెల 23న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. వెంటనే సమీప బంధువులను విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి బోయిని అంజయ్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. ఆమె ఆచూకీ లభిస్తే 87126 61847 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

కొత్తపేటలో వివాహిత..


చిలకమ్మ

శివ్వంపేట(నర్సాపూర్): కూలి పనికి వెళ్లిన వివాహిత అదృశ్యమైంది. ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటకు చెందిన మూడవత్ చిలుకమ్మ ఈనెల 22న గ్రామ శివారులోని మామిడి తోటలో కూలి పని కోసం ఇంట్లో నుంచి ఉదయం వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు, పలుచోట్ల వెతికిన ఆచూకీ లభించలేదు. గురువారం చిలుకమ్మ భర్త భీక్కు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ చెప్పారు.

నయా ట్రెండ్ గురూ..!

ఒకేలా చీరలు ధరిస్తూ బతుకమ్మ సంబురాలు

- ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న మహిళలు
- నాడు పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ..
- నేడు కోలాటం, డీజేలతో మార్మోగుతున్న వైనం


కోలాటం ఆడుతున్న మహిళలు

కోలాటానికే ప్రాధాన్యం

ప్రస్తుతం బతుకమ్మ పాటలు వినిపిస్తే మహిళలు చప్పట్లు కొట్టడం లేదు. కానీ కోలాటం ఆడేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అలాగే డీజే పాటలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు.

దుబ్బాకరూరల్: వేడుక ఏదైనా సరే.. మగువలు ఉంటేనే కల. అలాంటిది బతుకమ్మ పండుగ వచ్చిందంటే చాలు.. ఆడపడుచులతో గ్రామాలన్నీ కళకళలాడుతుంటాయి. ఈ పండుగను తెలంగాణ ఆడబిడ్డలు పిల్లాజెల్లలతో కలిసి రంగు రంగుల తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆనందంగా చేసుకుంటారు. ఏడాదంతా ఏం కట్టినా, ఏం పెట్టినా సరే.. బతుకమ్మ పండుగంటే మాత్రం జోర్దార్ కనబడాల్సిందేనని మగువలు కోరుకుంటారు. ఇందులో భాగంగానే టెక్నాలజీ మార్పుకు అనుగుణంగా నయా ట్రెండ్ అనుసరిస్తున్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా వారం రోజులుగా పలు రకాల పేర్లతో బతుకమ్మను పేర్చడంతోపాటు మహిళలంతా ఒకేలా దుస్తులు ధరించి సంబరాలు చేసుకుంటున్నారు.

తీరొక్క పూలతో బతుకమ్మ: ప్రకృతిలో లభించే రకరకాల పూలతో బతుకమ్మను మహిళలు తమ ఇంటిలో పేర్చుతారు. ఇంటిలో పేర్చి గౌరమ్మకు ప్రత్యేకించి పూజలు చేస్తారు.

ప్రధాన వీధుల్లో ఆటాపాటలు: బతుకమ్మను తయారు చేసి గల్లీ మహిళలంతా ఒక్క చోట చేరి బతుకమ్మను ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మను పెట్టి పాటలు పాడుతూ చప్పట్లు కొడుతూ సాగనంపుతారు.

ప్రకృతిలో లభించే పూలు: ప్రకృతిలో లభించే తీరొక్క పూలతో బతుకమ్మను అలంకరిస్తారు. గునుకపువ్వు, తంగెడు పువ్వు, గుమ్మడి పువ్వు, గుమ్మడి ఆకులు, బంతిపూలు, మందార పువ్వు, చామంతి, పట్టుగుత్తుల పూలు, సీతమ్మ దార పూలు, రామబాణం వంటి పూలను వాడుతారు.

గునుకు పువ్వు, తంగెడు పూలు కరువు: గతంలో బీడు పడిన భూముల్లో గునుగు పువ్వు, తంగెడు పువ్వు విచ్చలవిడిగా లభించేవి. కానీ నేడు బీడు భూములు సాగులోకి రావడంతో ఎక్కడ చూసిన గునుగు, తంగెడు పువ్వులు లభించడం లేదు.

పువ్వులకు మార్కెట్లో డిమాండ్: గునుగు పువ్వు, తంగెడు పూలు ఇతర పూలు పొలాల వద్ద లభించక పోవడంతో వాటికి డిమాండ్ పెరిగింది. గునుగ పువ్వు, తంగెడు పువ్వు ఆనాడు మార్కెట్లో విరివిగా లభించేవి. కానీ నేడు వాటికి మార్కెట్లో అధిక ధరలకు లభిస్తున్నాయి. అలాగే ఇతర రకాల పూలకు సైతం డిమాండ్ పెరిగింది.

పట్నం నుంచి పల్లెలకు: చాలా మంది ఉద్యోగ రీత్యా, బతుకు దెరువు కోసం పట్టణాల్లో స్థిర నివాసం చేసుకున్నారు. అయితే బతుకమ్మ, దసరా పండగలను తమ కుటుంబ సభ్యులతో గ్రామాలకు పయనమవుతారు. వారం రోజలపాటు ఆనందోత్సాహాలతో పండగను చేసుకుంటున్నారు.

మహిళలే స్వయంగా పాటలు: ఆనాడు మహిళలు బతుకమ్మను తీసుకెళ్లే సమయంలో ప్రధాన వీధుల్లో బతుకమ్మను పెట్టి నోటి ద్వారా పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఆడేవారు. మిగతా మహిళలు కూడా చప్పట్లు కొడుతూ పాడే వారు.

మార్మోగుతున్న డీజే పాటలు: ప్రస్తుతం బతుకమ్మను తీసుకెళ్లే సమయంలో మహిళలు ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మను పెట్టి డీజే పాటలు వేసుకుని ఆడుతున్నారు. చప్పట్లు కొట్టకపోవడంతోపాటు తమకు ఇష్టానుసారంగా పాటలు పాడుతున్నారు.


ఒకే రకం చీరలు ధరించిన మహిళలు

గల్లీ మహిళలంతా ఒకే రకం చీరలు

ఆనాటి మహిళలు వారికి నచ్చిన చీరలు ధరించి, మెడలో బంగారు గొలుసులు వేసుకుని బతుకమ్మను తీసుకెళ్లే వారు. కానీ ప్రస్తుతం ట్రెండ్ మారింది. గల్లీ మహిళలంతా ఒకే రకం చీరలు ధరించి బతుమ్మను తీసుకెళ్తున్నారు. గల్లీలో ఉన్న మహిళలంతా కలిసి ఆన్‌లైన్‌లో చీరలు బుక్ చేసుకుంటున్నారు. ఒకే రకం చీరలు ధరించి ప్రత్యేకంగా నిలుస్తున్నారు.

ఆనాటి పాటలు మాయం

ఆనాటి రోజుల్లో బతుకమ్మను ప్రధాన కూడళ్లల్లో పెట్టి పాటలు పాడే వాళ్లం. పాటలు పాడుతుంటే మా తోటి మహిళలంతా చప్పట్లు కొట్టే వాళ్లు. అప్పుడు గమ్మత్తుగా అనిపించేది. నేడు ఆ పాటలు, ఆటలు లేవు. పెద్ద పెద్ద సౌండ్లు పెడుతూ ఆడుతున్నారు.

– రాజవ్వ, దుబ్బాక

డీజేతో బతుకమ్మ పాటలు

డీజే ద్వారా వచ్చే పలు రకాల బతుకమ్మ పాటలు పెట్టుకుని ఆడుతున్నాం. అప్పటి పాటలు ఎక్కువ ఎవ్వరూ పాటించడం లేదు. దీంతో చప్పట్లు వేయకుండా కోలాటం ఆడుతున్నాం. గల్లీ మహిళలమంతా ఒకే రకం చీరలు ధరించి బతుకమ్మలు తీస్తున్నాం. ఒకే రకం చీరలతో ప్రత్యేకంగా నిలుస్తున్నాం.

– మౌనిక, దుబ్బాక

పాతతరం పాటలు మాయం: ఆనాడు మహిళలు బతుకమ్మ కథను పాటల ద్వారా చెప్పే వారు. కానీ ప్రస్తుతం తీరొక్క రకాల పాటలు అందుబాటులోకి వచ్చాయి. ఆనాటి పాట 'సీతమ్మ నాటింది.. ఉయ్యాలో... సిరి మల్లె చెట్టు ఉయ్యాలో... రామయ్య వేసిండు ఉయ్యాలో... రత్నాల పందిరి ఉయ్యాలో... బావి నీళ్ల తెచ్చి ఉయ్యాలో బామ సీతమ్మ ఉయ్యాలో'.. అంటూ పాటలు పాడే వారు. ప్రస్తుతం ఈ పాటలు కనుమరుగై డీజే, ఫోక్ పాటలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

నమ్మి విత్తితే.. నట్టేట ముంచింది

కాసిన కాత ఎండుముఖం

- ఆందోళన చెందుతున్న రైతు
- నకిలీ విత్తనాలే కారణమని ఆరోపణ


పత్తి పంటను చూపుతున్న రైతు

జగదేవపూర్(గజ్వేల్): నమ్మి విత్తనం విత్తితే ఉత్తబుర్రలైనట్లు.. ప్రస్తుతం ఓ రైతు పరిస్థితి ఆందోళనకరంగా మారింది. చేతికి వచ్చిన పంట చివరికి ఎండుముఖం పడడంతో ఓ రైతు దిగాలు చెందుతున్నాడు. చివరికీ నకిలీ విత్తనమే కారణంగానే పంటంతా ఎండిపోతుందని ఆవేదన చెందుతున్నాడు. మండలంలోని తిగుల్‌కి చెందిన ఎడ్ల జనార్దన్‌రెడ్డి రెండున్నర ఎకరాల్లో వానాకాలంలో పత్తి పంటను సాగు చేశాడు. సదానందం కంపెనీకి చెందిన ఆరు ప్యాకెట్ల పత్తి విత్తనాలు తీసుకొని విత్తగా.. ప్రారంభంలో పంట బాగానే ఉన్నా ప్రస్తుతం చెట్టుకు కాసిన కాయంతా నల్లగా మారుతుందని రైతు ఆందోళన చెందుతున్నాడు. అయితే పంట వేసినప్పటి నుంచి ఇప్పటి వరకు రెండు 20:20, డీఏపీ రెండు, యూరియా నాలుగు బస్తాలు వేశానని, మొత్తం రూ. 80 వేలకు వరకు పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం పంటను చూస్తే పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పంట ఎండుముఖంపై విత్తన కంపెనీ డీలర్ దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోవడం లేదని, వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


విజయ్ కుమార్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు రింగ్ రోడ్డుపై ఆగి ఉన్న కారును లారీ ఢీకొట్టిన సంఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం హైదరాబాద్లోని నాంపల్లికి చెందిన విజయ్ కుమార్ (27), రాచప్ప, జగదీశ్వర్, రమేష్, నందులతో కలిసి తుల్జాపూర్ వెళ్లేందుకు గురువారం కారులో బయలుదేరారు. కొల్లూరు వద్ద రింగ్ రోడ్డుపై కారు పంచర్ కావడంతో రోడ్డు పక్కనే కారు నిలిపారు. రమేష్, నందులు టైరు తీసుకొని పంచర్ చేసేందుకు వెళ్లగా.. విజయ్ కుమార్, రాచప్ప అక్కడే ఉన్నారు. ఈ సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ కారును వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో విజయ్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా.. రాచప్పకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు కార్మికుడు..


అభిషేక్

జిన్నారం (పటాన్‌చెరు): ప్రమాదవశాత్తు ఓ కార్మికుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదల పారిశ్రామికవాడలోని ఎస్వీఎస్ పరిశ్రమలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అభిషేక్ (22) కొంత కాలంగా పని చేస్తున్నాడు. అయితే గురువారం ప్రమాదవశాత్తు తాను పనిచేస్తున్న మిషన్‌లోనే పడి మృతి చెందాడు. వెంటనే యజమాన్యం అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు అనికేత్ శర్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ..


నాగార్జున

పటాన్‌చెరు టౌన్: అప్పుల బాధతో గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ దుర్గయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బొమ్మనుకుంటకు చెందిన నాగార్జున (32) ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఇటీవల కారు కొనుగోలుతో పాటు ఇంటి లోన్ కూడా ఉండడంతో అప్పులు పెరిగిపోయాయి. దీంతో అప్పుల విషయంపై కుటుంబ సభ్యులతో చెప్పుకుంటూ బాధపడుతూ ఉండేవాడన్నారు. ఈ క్రమంలోనే గత నెల 19న గడ్డి మందు తాగగా.. కుటుంబ సభ్యులు పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భూ రిజిస్ట్రేషన్ కాదనే బెంగతో వ్యక్తి మృతి

- రైతు మృతికి కారణమంటూ ఇంట్లో మృతదేహం ఉంచి నిరసన
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్


ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ శ్రీను

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో గురువారం ఉద్రిక్తత నెలకొంది. గ్రామానికి చెందిన పోలోజు చంద్రం(40) మూడేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన కత్తుల భాస్కర్‌రెడ్డికి వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ చేసి కొంత నగదు అప్పు తీసుకున్నాడు. ఇటీవల అప్పు చెల్లిస్తానని, తన భూమి తిరిగి రిజిస్ట్రేషన్ చేయాలని కోరగా.. అందుకు భాస్కర్‌రెడ్డి నిరాకరించాడు. అంతేకాకుండా భూమిలో వ్యవసాయ పనులు చేయవద్దని మందలించడంతో మనస్థాపానికి గురైన చంద్రం అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు చేర్యాల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అయితే తనకు సంబంధించిన భూమి తిరిగి రిజిస్ట్రేషన్ చేయడం లేదనే బెంగతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు చంద్రం మృతదేహాన్ని భాస్కర్‌రెడ్డి ఇంట్లో పెట్టి నిరసన చేపట్టారు. భూమి రిజిస్ట్రేషన్ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ శ్రీను, ఎస్ఐ నవీన్ బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

పోక్సో కేసులో నిందితుడికి ఇరవై ఏళ్ల జైలు


దుర్గయ్య

శివ్వంపేట(నర్సాపూర్): పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.15 వేల జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు న్యాయమూర్తి నీలిమ గురువారం తీర్పు ఇచ్చారు. మండల పరిధిలోని చెండికి చెందిన ఎంచర్ల దుర్గయ్య రెండేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడడంతో కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి మెదక్ ఫాస్ట్ ట్రాక్ పోక్స్ కోర్టు విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలోనే విచారించిన అనంతరం నిందితుడిపై 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.15 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఈ కేసులో నిందితుడికి శిక్షపడేలా కృషిచేసిన సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ మధుకర్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుల్స్ రవి, ఆనంద్, కృష్ణలను తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

జహీరాబాద్ టౌన్: పేకాడుతున్న ఆరు మందిని అరెస్టు చేశామని రూరల్ ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. మండలంలోని రంజోల్ గ్రామ పరిధిలో పేకాడుతున్నట్లు సమాచారం మేరకు గురువారం రాత్రి దాడి చేశామన్నారు. గ్రామంలోని పాడుబడిన ఇంటిలో పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు చెప్పారు. అనంతరం వారి నుంచి నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని వివరించారు.

కోతికి ప్రాణం పోసిన యువకులు


గాయపడిన కోతి

చేగుంట(తూప్రాన్): విద్యుదాఘాతానికి గురైన కోతికి వైద్యం అందించి ప్రాణం పోశారు. చేగుంట స్టేషన్ రోడ్డులో విద్యుత్ లైన్‌కు తగిలిన కోతి విద్యుదాఘాతంతో కిందపడిపోయింది. వెంటనే యువకులు అస్వస్థతకు గురైన కోతిని స్థానిక పశువుల డాక్టర్ లింగమూర్తి వద్దకు తీసుకెళ్లి చికిత్స అందించారు. చికిత్స అనంతరం కోతి కోలుకునుంది. అయితే కోతి ముఖం భాగంలో గాయమైందని లింగమూర్తి తెలిపారు.

155 గంజాయి మొక్కల పట్టివేత

నారాయణఖేడ్: మనూరు మండలంలోని బోరంచలో జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. బోరంచకి చెందిన రైతు నారాయణ తన వ్యవసాయ పొలంలోని పత్తి పంటలో అంతర పంటగా 155 గంజాయి మొక్కలు సాగు చేసినట్లు గుర్తించారు. ఈ గంజాయి విలువ రూ.5లక్షల వరకు ఉంటుందని ఎక్సైజ్ సీఐ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి గంజాయిని ధ్వంసం చేసినటు చెప్పారు.


పట్టుబడిన గంజాయి మొక్కలు

'చలో' తుల్జాపూర్

- శక్తి పీఠం.. భవానీ క్షేత్రం
- అమ్మవారి దర్శనానికి కాలినడకన భక్తులు


కాలినడక వెళ్తున్న జహీరాబాద్ భక్తులు

జహీరాబాద్ టౌన్: దసరా పండుగను జహీరాబాద్ వాసులు నియమనిష్టలతో చేసుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ముఖ్యంగా ఈ ప్రాంత ప్రజలు శరన్నవరాత్రుల్లో తొమ్మిది రోజుల పాటు భవానీ మాతను పూజిస్తారు. ఇలా తొమ్మిది, ఐదు, మూడు రోజుల ఘట్టాలు కూర్చొబెడతారు. ఇందులో భాగంగానే నవరాత్రుల్లో అమ్మవారిని పూజించి మహారాష్ట్రలోని తుల్జాపూర్ భవానీ మాతను దర్శించుకునేందుకు కాలినడకన నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివెళ్తుంటారు. మహారాష్ట్రలోని ఉస్మానాబాద్ జిల్లాలో 180 కిలోమీటర్ దూరంలో తుల్జాపూర్ పుణ్య క్షేత్రం ఉంది. ఈ దేవాలయాన్ని 12వ శతాబ్దంలో నిర్మించగా..ఛత్రపతి శివాజీ మహారాజ్ తన కత్తిని ఇక్కడి నుంచే పొందినట్లు చెబుతారు. ఈ సందర్భంగా జహీరాబాద్, నారాయణఖేడ్, సదాశివపేట, సంగారెడ్డి, వికారాబాద్, తాండూర్ తదితర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తుల్జాపూర్‌కు తరలి వెళ్తుంటారు. అలాగే భక్తుల విశ్రాంత కోసం ప్రత్యేక టెంట్‌లలో సౌకర్యాలు, భక్తుల ఆకలి తీర్చడానికి అడుగడుగున అన్నదాన సేవా కేంద్రాలు దర్శనమిస్తుంటాయి.

మత్తు పదార్థాలు తరలిస్తే కఠిన చర్యలు

ఎస్పీ డీవీ శ్రీనివాసరావు


పట్టుకున్న గంజాయితో ఎస్పీ, పోలీసులు

మెదక్ మున్సిపాలిటీ: అక్రమంగా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను సరఫరా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు హెచ్చరించారు. ఇటీవల జిల్లాలో పోలీసులు స్వాధీనం చేసుకున్న 5 కేసుల్లో 8 కేజీల 150 గ్రాముల గంజాయిని గురువారం జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వీర్యం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అడ్డుకట్ట వేసేందుకు నిరంతర దాడులు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి అక్రమ రవాణా, విక్రయాన్ని అరికట్టేందుకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా యువతకు మత్తు పదార్థాల వినియోగంపై కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అంతకు ముందు మెదక్ రూరల్ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జార్జ్.. ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు.

బాధిత కుటుంబానికి పరిహారం..

బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన నర్సాపూర్ హెడ్ కానిస్టేబుల్ పండరి కుటుంబానికి ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ప్రభుత్వం నుంచి మంజూరైన పరిహారం అందజేశారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి రూ.లక్ష మంజూరవ్వగా.. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మృతుడి భార్య చంద్రకళకు ఎస్పీ అందజేశారు. విధి నిర్వహణలో మరణించిన పోలీస్ కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉండడంతో పాటు సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు.

మెరిసిన మెతుకు సీమ

గ్రూప్ 1 ఫలితాల్లో సత్తా చాటిన మనోళ్లు


ప్రణయ్‌సాయి | ధనసిరి దివ్య | శ్రీకాంత్ | వంశీకృష్ణ | శ్రీధర్ | రాజుపవార్


శైలేష్ | బైండ్ల వెంకటేష్ | సచిన్ | అఖిలజారెడ్డి | ప్రభాత్‌రెడ్డి | నిశ్రిత

గ్రూప్ -1 ఫలితాలను టీజీపీఎస్సీ విడుదల చేసింది. ఈ ఫలితాల్లో జిల్లా పేదింటి కుసుమాలు సత్తా చాటారు. చిన్నకోడూరు మండలం గంగాపూర్‌కి చెందిన ఓ రైతు బిడ్డ నరిగే స్వామి యాదవ్ 95వ ర్యాంకు సాధించి డీఎస్పీ సాధించాడు. అలాగే రామచంద్రాపురంలోని కాకతీయనగర్ కాలనీ చెందిన ధనసిరి దివ్య 234 ర్యాంక్ సాధించి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్‌గా ఎంపికయ్యారు.అదే విధంగా హుస్నాబాద్ మండలంలోని పూల్‌నాయక్ తండాకు చెందిన లావుడ్య శ్రీకాంత్ 89వ ర్యాంకు సాధించి డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికయ్యారు. పొట్లపల్లికి చెందిన సబ్బని వంశీకృష్ణ సెలెక్ట్ అంట్రిజరీలో ఉద్యోగం సాధించాడు. ఇక, అక్కన్నపేట మండలంలోని కట్కూర్‌కి చెందిన ఉల్లెంగుల శ్రీధర్ 864 ర్యాంకు సాధించి ఎంపీడీఓ పోస్టుకు ఎంపికయ్యాడు. టేక్మాల్ మండలంలోని షాబాద్‌తండాకు చెందిన రాజు పవార్ 456 ర్యాంకుతో అసిస్టెంట్ ట్రెజరి ఆఫీసర్ (ఏటీఓ) పోస్టుకు ఎంపికయ్యారు. మెదక్‌కి చెందిన ఓ గోల్డ్‌స్మిత్ కుమారుడు శైలేష్ గ్రూప్-1లో ర్యాంకు సాధించి డీఎస్పీగా ఎంపికయ్యాడు. దుబ్బాకకి చెందిన గ్రూప్-1 ర్యాంకర్ బైండ్ల వెంకటేష్ జిల్లా గిరిజన సంక్షేమ అధికారిగా ఎంపికయ్యారు. సిద్దిపేటలోని శ్రీనగర్ కాలనీకి చెందిన సచిన్ 360 ర్యాంక్ సాధించి ఎంపీడీఓ పోస్టుకు ఎంపికయ్యారు. న్యాల్‌కల్‌లోని మిర్జాపూర్(బి)కి చెందిన ఎక్కెల్లి అఖిలజారెడ్డి 125 ర్యాంక్ సాధించి గ్రూప్-1 ఉద్యోగానికి ఎంపికైంది. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం ముసాపేటకి చెందిన ఎరగారి ప్రభాత్‌రెడ్డి గ్రూప్-1లో 73వ ర్యాంకు సాధించి డీఎస్పీగా ఎంపికయ్యాడు. తూప్రాన్‌కి చెందిన బోయిన్‌పల్లి ప్రణయ్‌సాయి డీఎస్పీ ఉద్యోగం సాధించి సత్తాచాటాడు. మెదక్ పట్టణానికి చెందిన దొంత నరేష్, శిరీషల కుమార్తె నిశ్రిత గ్రూప్-1 ఫలితాల్లో డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికైంది.

టీచర్ కూతురికి టాప్ ర్యాంక్


కుటుంబ సభ్యులతో నిఖిత

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని కోడిప్యాకకి చెందిన మేరెడ్ల నిఖిత గ్రూప్-1లో 8 ర్యాంక్ సాధించి డిప్యూటీ కలెక్టర్ పోస్టుకు ఎంపికైంది. తండ్రి సుధాకర్ రెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా.. తల్లి పద్మ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. అయితే తనకు చిన్నప్పటి నుంచే కలెక్టర్ కావాలని లక్ష్యంగా ఉండేదని నిఖిత చెప్పుకొచ్చారు. గతంలో ఐఏఎస్ ఇంటర్వ్యూ వరకు వెళ్లి విఫలమైనా నిరాశ చెందకుండా గ్రూప్ 1లో మెరుగైన ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్‌కు ఎంపికైనట్లు తెలిపింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే గ్రూప్ 1లో ర్యాంకు సాధించానని తెలిపింది.

డీఎస్పీగా రైతు బిడ్డ..


నరిగే స్వామి

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు మండలం గంగాపూర్‌కి చెందిన ఓ రైతు బిడ్డ నరిగే స్వామి యాదవ్ గ్రూప్-1 ఫలితాల్లో 95వ ర్యాంకు సాధించి డీఎస్పీ(సివిల్) సాధించాడు. రైతు కుటుంబానికి చెందిన స్వామి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పోటీ పరీక్షలకు హాజరై గ్రూప్-1 ఉద్యోగాన్ని సాధించాడు. హైదరాబాద్‌లోని తెలంగాణ స్టడీ సెంటర్‌లో మెంటర్‌గా పని చేస్తున్న స్వామి గ్రూప్-2 లో 110 ర్యాంకుతో ఏటీఓ, గ్రూప్-3 ఫలితాల్లో 52వ ర్యాంకు సాధించాడు. గతంలో పంచాయతీ కార్యదర్శిగా కొద్ది రోజులు పని చేశాడు. కాగా, చంద్రయ్య, కనకవ్వలకు ముగ్గురు కూతుర్లు, కుమారుడు స్వామి ఉన్నారు. వీరు గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తమ కుటుంబంలో ఉన్నత చదువులు ఎవరూ చదవక పోవడంతో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పట్టుదలతో చదివి గ్రూప్ 1 ర్యాంకు సాధించినట్లు స్వామి తెలిపారు.